క్లుప్తంగా

తనిఖీలు ముమ్మరం చేయాలి



తిరువూరు: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సమీపిస్తున్నందున అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలని విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు వి. జస్టిన్ అధికారులను ఆదేశించారు. తిరువూరు నియోజకవర్గంలోని ఖమ్మం జిల్లా రాజవరం రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలను ఆయన పరిశీలించారు. తెలంగాణ నుంచి రాష్ట్రంలోకి ప్రవేశించే ప్రతి వాహనాన్ని సమగ్రంగా తనిఖీ చేయాలని ఆదేశించారు.

మౌలిక వసతులు కల్పించాలి

చాట్రాయి: పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎస్ఏ రామన్ అన్నారు. సోమవారం మండలంలోని కోటపాడులో 15,16,17, చిన్నంపేట 12,13,14 పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. పోలింగ్ కేంద్రాలను విధిగా ప్రతి రోజూ అధికారులు తనిఖీ చేసి ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలని, పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేయాలని, గ్రామాల్లో ఓటింగ్ శాతం పెరిగేలా సంబంధిత అధికారులు కృషి చేయాలని ఆయన సూచించారు.

ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

మైలవరం: ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్, మైలవరం నియోజకవర్గ ఎన్నికల అధికారి పి. సంపత్‌కుమార్ అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఎన్నికల సిబ్బందికి రెండో రోజు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సంపత్‌కుమార్ పాల్గొని నమూనా ఎలక్షన్ నిర్వహించి అధికారులకు ఈవీఎంలు, వీవీ ప్యాట్ల పనితీరుపై అవగాహన కల్పించారు. మంగళవారం ఆర్‌ఓ కార్యాలయం వద్ద ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఇంకా ఎవరైనా తమ ఓటు హక్కును వినియోగించుకోని సిబ్బంది ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఈవీఎం కమిషనింగ్ ప్రక్రియ

నూజివీడు: ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను సోమవారం ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎస్ఏ రామన్ పరిశీలించారు. నూజివీడు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని 286 పోలింగ్ స్టేషన్లకు ఉపయోగించనున్న ఈవీఎంలను సిద్ధంచేసే ఈవీఎం కమిషనింగ్ ప్రక్రియను నిర్వహిస్తున్న సారథి ఇంజినీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూంను ఆయన సందర్శించారు. ఈవీఎం కమిషనింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈవీఎం కమిషనింగ్ ప్రక్రియ వివరాలను నూజివీడు రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ వై. భవానీ శంకరి ఎన్నికల సాధారణ పరిశీలకులకు వివరించారు.

సర్టిఫికెట్లు అందజేత

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈడీఎక్స్ కోర్సు పూర్తి చేసిన ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈడీఎక్స్ కోర్సు ద్వారా అంతర్జాతీయంగా వివిధ యూనివర్సిటీలకు చెందిన సర్టిఫికెట్ కోర్సులను కళాశాల విద్యార్థులు పూర్తి చేశారన్నారు. కార్యక్రమంలో ఈడీఎక్స్ కోర్స్ కో–ఆర్డినేటర్ బి. సుభాషిణి, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకులు బాలసుబ్రహ్మణ్యం, కె.శ్యామ్‌సుందర్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నాన్నారు.

వినియోగదారులకు అవగాహన

మైలవరం: సైబర్ నేరాల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని మైలవరం ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ వి. సుబ్రహ్మణ్యం అన్నారు. మైలవరం ఎస్‌బీఐలో వినియోగదారులకు సైబర్ నేరాలపై అవగాహనా సదస్సు సోమవారం నిర్వహించారు. తెలియని ఫోన్ నంబర్ల నుంచి ఫోన్లు వచ్చి సమాచారం అడిగితే చెప్పకూడదన్నారు. తెలియని ఫోన్ నంబర్ల నుంచి మీకు సంబంధించిన సమాచారం అడిగితే వెంటనే క్రైమ్ పోలీస్‌లకు తెలియజేయాలని సూచించారు. అదే విధంగా ఫోన్ నంబర్ 1930కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వినియోగదారులు పాల్గొన్నారు.

కొనసాగిన పోస్టల్ బ్యాలెట్

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో శని, సోమవారాల్లో 740 మంది ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని మైలవరం నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ పి. సంపత్‌కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ సిబ్బందికి పలు సూచనలు చేశారు. 7, 8 తేదీలలో కూడా ఎన్నికల సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని చెప్పారు.

తిరువూరులో ముగిసిన పోస్టల్ బ్యాలెట్

తిరువూరు: తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే సదుపాయం సోమవారం ముగిసింది. నియోజకవర్గంలో 1,762 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోగా 1,739 మంది ఈ సదుపాయాన్ని వినియోగించుకుని ఓటువేశారని రిటర్నింగ్ అధికారి మాధవి తెలిపారు.

అభివృద్ధిపై వసంత అసత్య ప్రచారం

- నిధులివ్వలేదంటూ ఆరోపణలు
- సమస్యలను గాలికొదిలేసి ఐదేళ్లు ప్రజలకు దూరంగా..
- శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు మాత్రమే హాజరు
- గత ఐదేళ్లలో జరిగిన నిర్మాణాలకు వసంత సొంత డబ్బులు పెట్టాడా అని ప్రశ్నిస్తున్న ప్రజలు





మైలవరం పట్టణంలో రూ.3 కోట్లతో నిర్మించి ప్రారంభించిన 50 పడకల ప్రభుత్వాస్పత్రి భవనం ; జి.కొండూరులో నిర్మించిన జగనన్న కాలనీ గృహాలు

జి.కొండూరు: మైలవరం నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా పాలన సాగుతోందని వసంత వెంకటకృష్ణప్రసాద్ తన నోటితో తానే చెప్పారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు, ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రుల భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు ఆయనే శంకుస్థాపనలు చేశారు. నిర్మాణాలు పూర్తయిన భవనాలకు ఆయనే ప్రారంభోత్సవాలు జరిపారు. నేడు స్వార్థ రాజకీయాల కోసం పార్టీ మారి టీడీపీలో చేరారు. ఆ వెంటనే మాట కూడా మార్చారు. రూ.300 కోట్లకు పైగా నిధులతో నియోజకవర్గంలో అభివృద్ధి జరుగుతుందన్న నోటితోనే నేడు ఒక్క రూపాయి కూడా అభివృద్ధికి ఇవ్వలేదంటూ అబద్ధపు ప్రచారానికి తెరలేపారు. నమ్మిన ప్రజలకు, పార్టీలకు వెన్నుపోటు పొడవడం, పార్టీలు మారడం, మాటలు మార్చడం వసంతకు కొత్తేమీ కాదు కానీ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, అభివృద్ధి నుంచి అందుతున్న ఫలాలు ప్రజలకు కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్నా పచ్చిగా అబద్ధపు మాటలు మాట్లాడటంపై ప్రజలు చర్చించుకుంటున్నారు.

రాష్ట్ర భవిష్యత్ అంటూ కొత్త పాట..

నియోజకవర్గ ప్రజలను ఐదేళ్లపాటు గాలికొదిలేసి ఐతవరం, హైదరాబాద్, అమెరికాలలో గడిపిన వసంత.. నేడు రాష్ట్రాభివృద్ధి, ఉద్యోగాలు, రాజధాని, నిధులు, నీళ్లు అంటూ కొత్తపాట పాడుతున్నారు. మైలవరం నియోజకవర్గానికి సాగునీరు, తాగునీరు ఏ దిక్కు నుంచి వస్తుందో కూడా నేటికీ తెలుసుకోని వసంత, చింతలపూడి, పోలవరం అంటూ పెద్ద పెద్ద మాటలతో ఎన్నికల ప్రచారం చేస్తుండడం చూసి ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. ఐదేళ్ల పాటు నియోజకవర్గంలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, శుభకార్యాలు వంటి ప్రత్యేక సమయాలలో మినహా ఏనాడు ప్రజల సమస్యల కోసం ప్రత్యేకంగా సమయం కేటాయించని వసంత, నియోజకవర్గానికి తానేమి చేస్తాడో చెప్పకుండా తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు స్థాయిని మరిచి నేరుగా ముఖ్యమంత్రిపై వ్యాఖ్యలు చేస్తున్నారు. ఐదేళ్ల పాటు తన ప్రత్యర్థిగా ఉన్న దేవినేని ఉమామహేశ్వరరావుతో పాటు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, లోకేష్‌లపై మాటల యుద్ధం చేసిన వసంత, రెండు నెలలుగా ఆయన మాట్లాడుతున్న తీరు చూసి రాజకీయ ఉద్దండులు సైతం ముక్కున వేలేసుకుంటున్నారు. కేవలం పదవీ కాంక్షతో దేవినేని ఉమాని సైతం మించిపోయి మాటలు మారుస్తున్న వసంతను చూసి ఊసరవెల్లి సైతం ఆశ్చర్యపోతుంది.

ఇది అభివృద్ధి కాదా..

మైలవరం నియోజకవర్గంలో ఈ ఐదేళ్ల కాలంలో జరిగిన సంక్షేమ కార్యక్రమాలు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో పాల్గొని ఫొటోలకు పోజులిచ్చిన వసంత వెంకటకృష్ణ ప్రసాద్‌కి జరిగిన అభివృద్ధి కనిపించడం లేదా లేక పార్టీ మారగానే మతిభ్రమించి మాట్లాడుతున్నారా అనే చర్చ జరుగుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2019 నుంచి 2024 మధ్య కాలంలో నియోజకవర్గంలో రూ.300 కోట్లకు పైగా ఖర్చుతో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. అదేవిధంగా రూ.1200 కోట్లకు పైగా సంక్షేమ పథకాల రూపంలో నియోజకవర్గ ప్రజలు లబ్ధిపొందారు. మైలవరం పట్టణ ప్రభుత్వాస్పత్రి 30 పడకల నుంచి 50 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ రూ.3 కోట్లతో నూతన భవనాన్ని నిర్మించి అధునిక వసతులు కల్పించారు. దీనితో పాటు నియోజకవర్గంలో నాలుగు నూతన ఆస్పత్రి భవనాలు, ఐదు ఆస్పత్రి భవనాల అభివృద్ధికి రూ.4.88 కోట్లు ఖర్చు చేశారు. అదేవిధంగా 77 గ్రామ సచివాలయాలకు రూ.33.57 కోట్లు, 62 రైతు భరోసా కేంద్రాల నిర్మాణానికి రూ. 18.22 కోట్లు, 67 వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణానికి రూ.15.94 కోట్లు కేటాయించారు. 15 సహకార సొసైటీ భవనాల నిర్మాణానికి రూ.4.56 కోట్లు, జగనన్న ఇళ్ల స్థలాల కొనుగోలు, అభివృద్ధికి రూ.76.15 కోట్లు, ఆర్ అండ్ బి శాఖ తరపున రహదారుల అభివృద్ధికి 28.70 కోట్లు కేటాయించారు. నాడు–నేడు కింద రూ.24 కోట్లకు పైగా నిధులతో ప్రభుత్వ పాఠశాలల భవనాలను అధునికీకరించారు. నియోజకవర్గంలో రూ.300 కోట్లకు పైగా నిధులతో ప్రారంభమైన పనులు 80 శాతానికి పైగా నిర్మాణాలు పూర్తయి ప్రారంభించారు. ఇదంతా అభివృద్ధి కాదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

సంక్షేమం కోసం వైఎస్సార్ సీపీని గెలిపించండి

తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి స్వామిదాసు



వావిలాలలో ప్రచారం చేస్తున్న స్వామిదాసు

తిరువూరు: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని వైఎస్సార్ సీపీ తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. తిరువూరు మండలం వావిలాలలో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిదాసు మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ఏపీ శ్రీలంకగా మారుతుందంటూ తీవ్ర విమర్శలు చేసిన తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు ఇప్పుడు ఎన్నికల్లో గెలవడానికి అంతకంటే ఎక్కువ పథకాలు అమలు చేస్తానని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం చేస్తున్న కృషికి వక్ర భాష్యం చెబుతూ తెలుగుదేశం నేతలు ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై దుష్ప్రచారం చేస్తున్నారని, వారి ప్రచారాలను నమ్మవద్దని స్వామిదాసు కోరారు. దేశ, విదేశాల్లో పలు ప్రభుత్వాలు ఏపీలో సంక్షేమ పథకాలను గురించి ఆసక్తిగా పరిశీలిస్తున్నాయన్నారు. వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోకు, తెలుగుదేశం మేనిఫెస్టోకు తేడాను ప్రజలు గమనించి మంచి చేస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేయాలని కోరారు. నాయకులు రాజవరపు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలన

ఎంపీ అభ్యర్థి కేశినేని నాని



పశ్చిమ ఇబ్రహీంపట్నంలో ప్రచారం చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కేశినేని నాని, తిరుపతిరావు

ఇబ్రహీంపట్నం: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లుగా సుపరి పాలన చేశారని విజయవాడ ఎంపీ అభ్యర్థి, ఎంపీ కేశినేని నాని అన్నారు. పశ్చిమ ఇబ్రహీంపట్నం, మూలపాడులో మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావుతో కలిసి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో భారీ రోడ్ షో జరిపారు. అడుగడుగున ప్రజలు బ్రహ్మరథం పట్టారు. హారతులిచ్చి ఆత్మీయ స్వాగతం పలికారు. వారు మాట్లాడుతూ జగనన్న పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఏ అవసరం వచ్చినా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని చెప్పారు. సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థతో అవినీతికి తావు లేకుండా పథకాలను ఇంటివద్దకే జగన్ ప్రభుత్వం అందించిందన్నారు. 2019 మేనిఫెస్టోను 99 శాతం అమలు చేశారని చెప్పారు. సంక్షేమ పథకాలు అమలు కావాలంటే మరలా సీఎంగా జగనన్న రావాలన్నారు. టీడీపీ మేనిఫెస్టో ప్రజలను మోసం చేసేలా ఉందన్నారు. టీడీపీ నాయకులు కల్లబొల్లి మాటలతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను లొంగదీసుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థులుగా నాకు, తిరుపతి రావుకు ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి విజయం చేకూర్చాలని కోరారు. పరిశీలకులు నాగిరెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు జోగి వెంకటేశ్వరరావు, బట్టరాజ కార్పొరేషన్ డైరెక్టర్ పోరంకి పద్మావతి, ఎస్.శివశంకరరావు, పోతురాజు, మేడపాటి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు హామీలను ప్రజలు నమ్మరు

ఎమ్మెల్యే అభ్యర్థి మేకా ప్రతాప్ అప్పారావు



రేగుంటలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్‌అప్పారావు

నూజివీడు: చంద్రబాబును నమ్మితే ప్రజలకు ఒక్క పథకం కూడా ఉండదని ఎమ్మెల్యే అభ్యర్థి మేకా వెంకటప్రతాప్ అప్పారావు అన్నారు. సంక్షేమ పథకాలను అమలు చేసి చూపించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ అండగా నిలవాలని కోరారు. నూజివీడు మండలం రేగుంట, యనమదల, సుంకొల్లు గ్రామాల్లో సోమవారం సాయంత్రం ప్రతాప్ అప్పారావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మాయమాటలు చెబుతూ ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నాడని, ప్రజలెవరూ ఆయన మాటలు నమ్మడం లేదన్నారు. ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసి చూపిన వైఎస్ జగన్ వెంటే రాష్ట్ర ప్రజలందరూ ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ ఓట్లు రెండూ సీలింగ్ ఫ్యాన్ గుర్తుపై వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. టీడీపీ తరఫున పోటీ చేసేందుకు నూజివీడు నియోజకవర్గంలో స్థానిక వ్యక్తులు ఎవరూ లేకపోవడం ఆ పార్టీ దుస్థితికి అద్దం పడుతోందన్నారు. స్వార్థపరుడైన పార్థసారధికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే అర్హత లేదన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని ఓడించి బంగాళాఖాతంలో కలపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, ఎంపీపీ ఆరేపల్లి శిరీష, సర్పంచ్‌లు వరికూటి వెంకటేశ్వరరావు, దుద్దు నాగమల్లేశ్వరరావు, నాయకులు ఆరేపల్లి రాంబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే పేదలకు భరోసా

మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తిరుపతిరావు



ఇబ్రహీంపట్నంలో ప్రచారం చేస్తున్న సర్నాల తిరుపతిరావు తదితరులు

ఇబ్రహీంపట్నం: వైఎస్సార్ సీపీతోనే పేదలకు ఆర్థిక భరోసా లభిస్తుందని, వారి జీవితాల్లో వెలుగు నిండుతాయని వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు అన్నారు. ఇబ్రహీంపట్నంలోని పలు వార్డుల్లో సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్ షోతో పాటు వీధుల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఎస్సీ, బీసీ, ఓసీ, ముస్లిం ఏరియాలో జరిగిన ప్రచారంలో ప్రజలు బ్రహ్మరథం పట్టారు. తిరుపతిరావు మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం, కొండపల్లి మున్సిపాలిటీలో 4,913 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించామన్నారు. 1,19,470 మందికి డీబీటీ ద్వారా రూ.326,79,27,815 నగదు లబ్ధి కలిగిందని చెప్పారు. ఈ ఎన్నికల్లో చంద్రబాబు కుటిల యత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపు ఇచ్చారు. వలస నాయకులు సహజ సంపద దోచుకునేందుకే వచ్చారన్నారు. బూడిద అక్రమ తరలింపులో టీడీపీ అభ్యర్థి గతంలో పెట్టిన ఇన్‌చార్జ్‌లపై పోలీస్ స్టేషన్‌లో కేసులు ఉన్న మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఇప్పుడు పార్టీ మారి ఎవరు బూడిద తోలుతున్నారో పొక్లెయిన్ ఆపరేటర్లను అడగాలని నీతులు చెప్పడం ఆయనకే చెల్లిందన్నారు. ఎంపీగా కేశినేని నాని, ఎమ్మెల్యేగా నాకు ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని కోరారు. జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, కౌన్సిలర్లు గుంజా శ్రీనివాస్, నాగరాజకుమారి, నల్లమోతు లక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

బ్యాలెట్‌పై అవగాహన

తిరువూరు: ఈ నెల 13న జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసే వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గుర్తులు, బ్యాలెట్‌లో వారి నెంబరును వివరిస్తూ తిరువూరు మండలంలో సోమవారం పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తిరువూరు ఏడో వార్డులో కౌన్సిలర్ పరసా శ్రీనివాసరావు, 13వ వార్డులో కౌన్సిలర్ ఇనపనూరి చిన్నారి, 9వ వార్డులో కౌన్సిలర్ మూడు దుర్గారావు, 16వ వార్డులో పార్టీ ఇన్‌చార్జి తిరుమలశెట్టి రాధాకృష్ణ, 18వ వార్డులో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కాలసాని విజయలక్ష్మి ఓటర్లను కలిసి బ్యాలెట్‌పై అవగాహన కల్పించారు. తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు, విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని)లకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. పార్టీ నాయకులు వాళ్ల సురేష్, నాయని కోటేశ్వరరావు, ఇనపనూరి రవి, నాగేశ్వరరావు పాల్గొ న్నారు. మండలంలోని ముష్టికుంట్ల, వావిలాల, వామకుంట్ల, మునుకుళ్ళ, కోకిలంపాడు, లక్ష్మీపురం గ్రామాల్లో కూడా ఓటర్లకు బ్యాలెట్ పత్రాలపై అవగాహన కల్పిస్తూ స్థానిక నాయకులు ప్రచారం చేశారు.

పేదలకు ఎంతో మేలు చేశాం.. ఆదరించండి



నూజివీడులోని 23వ వార్డులో ప్రచారం చేస్తున్న చంటినాయన

నూజివీడు: సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, పేద, మధ్య తరగతి ప్రజలు ఆర్థికంగా బలోపేతం కావాలన్నా వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ నూజివీడు అభ్యర్థి మేకా వెంకటప్రతాప్ అప్పారావు సోదరుడు మేకా మోహనగోపాల అప్పారావు అన్నారు. నూజివీడులోని 20వ వార్డులో సోమవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాల వల్ల ప్రజలకు ఆర్థిక భరోసా లభించిందన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, నాయకులు కాలి సుగుణరావు, చేబత్తిన మున్నా, కర్రి ఆరోగ్యం పాల్గొన్నారు.

నూజివీడు: వైఎస్సార్ సీపీకి ఓటేస్తే రాష్ట్రం అభివృద్ధి చెందడమే కాకుండా, సంక్షేమ పాలన కొనసాగుతుందని మేకా ప్రతాప్ అప్పారావు తనయుడు మేకా వేణుగోపాల అప్పారావు (చంటినాయన) అన్నారు. పట్టణంలోని 23వ వార్డులో సోమవారం రాత్రి ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. చంటినాయన మాట్లాడుతూ కరోనా కష్టకాలంలోనూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించారని గుర్తు చేశారు. ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. షేక్ యూనస్ పాషా(గబ్బర్), బాబీ, నాయకులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఇంటింటి ప్రచారం



కొండపర్వలో ప్రచారం చేస్తున్న నాయకులు

విస్సన్నపేట: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి స్వామిదాసు, ఎంపీ అభ్యర్థి కేశినేని నానిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ శ్రేణులు సోమవారం రెడ్డిగూడెం రోడ్డు, కొండపర్వ గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధిని చూసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నమూనా ఈవీఎంలపై ఓటు హక్కు వినియోగించుకోవడంపై అవగాహన కల్పించారు. వైస్ ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ ఓలేటి దుర్గారావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని కొండపర్వ గ్రామంలో జరిగిన ప్రచారంలో సర్పంచ్ జి. రమేష్‌బాబు, వైస్‌ఎంపీపీ గాజుల శ్రీనివాసరావు, జి.చంద్రశేఖరరావు, పైడపాల ప్రవీణ్, మంగయ్య, పి. పాపారావు పాల్గొన్నారు. మండలంలోని కలగర పంచాయతీ ములగలపాటివారి గూడెంలో ప్రచారం నిర్వహించారు.

- ఎ.కొండూరు: తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసును గెలిపించాలని కోరుతూ వైఎస్సార్ సీపీ నాయకులు చీమలపాడు, కృష్ణారావుపాలెం, కోడూరు, పోలిశెట్టిపాడు, రామచంద్రాపురం, వల్లంపట్ల, గోపాలపురం, కంభంపాడు గ్రామాల్లో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల వివరాలను వివరిస్తూ వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఓట్లను అభ్యర్థించారు. సర్పంచుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు టి సురేష్, నాయకులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: కిలేశపురం, కొండపల్లి మున్సిపాలిటీలోని వివిధ వార్డుల్లో సోమవారం వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కేశినేని నాని, సర్నాల తిరుపతిరావును గెలిపించాలని కోరారు. మండల కన్వీనర్ బొంత సాంబశివరావు, వైస్ ఎంపీపీ నాగ బాలమ్మ పాల్గొన్నారు.

- ఆగిరిపల్లి: వైఎస్సార్ సీపీతోనే పేదల సంక్షేమం సాధ్యమవుతుందని ఎంపీటీసీ సభ్యుడు సాదం గోపి అన్నారు. ఆగిరిపల్లిలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి ఎంపీ అభ్యర్థిగా సునీల్ కుమార్ యాదవ్‌ను, ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎమ్మెల్యే అభ్యర్థిగా మేకా వెంకట ప్రతాప్ అప్పారావును గెలిపించాలని కోరారు.
- భవానీపురం(విజయవాడపశ్చిమ): రానున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావుల విజయాన్ని కాంక్షిస్తూ జక్కంపూడి వైఎస్సార్ కాలనీలోని గొల్లపూడి 9వ సెగ్మెంట్‌లో వైఎస్సార్ సీపీ నాయకుల ప్రచారం నిర్వహించారు. ఎంపీటీసీ కొరగంజి సత్యనారాయణ, కాలనీ ఎన్నికల ఇన్‌చార్జ్ అవినాష్, బాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నేడు మేకా ప్రతాప్ ప్రచారం

ఆగిరిపల్లి: వైఎస్సార్ సీపీ నూజివీడు ఎమ్మెల్యే అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు మంగళవారం ఉదయం కొత్త ఈదర, సీతారాంపురం, మధ్యాహ్నం ఆగిరిపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు



తిరువూరులో టీడీపీ నుంచి పార్టీలో చేరిన వారితో స్వామిదాసు

తిరువూరు: స్థానిక 19వ వార్డులో టీడీపీ క్రియా శీలక కార్యకర్తలు సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. 35 కుటుంబాల నుంచి 110 మంది కావటి వెంకటేశ్వరరావు, వద్రాణపు అంజయ్య, సూర్యనారాయణల ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు సమక్షంలో వైఎస్సార్ సీపీ సభ్యత్వం స్వీకరించారు. వారిని పార్టీ కండువాలు కప్పి స్వామిదాసు ఆహ్వానించారు. 19వ వార్డు కౌన్సిలర్ పరసా సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు గత్తం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జనసేన నుంచి..

ఇబ్రహీంపట్నం: తుమ్మలపాలెం జనసేన పార్టీకి చెందిన ప్రధాన నాయకుడు కొండిశెట్టి నాగమల్లేశ్వరరావు సోమవారం ఆ పార్టీ వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. ఆయనకు నియోజకవర్గ పరిశీలకులు కర్ర హర్షవర్ధన్‌రెడ్డి, చల్లా బ్రహ్మేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు జోగి వెంకటేశ్వరరావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండల కన్వీనర్ బొంత సాంబశివరావు, చింతల చిట్టిబాబు, దుర్గగుడి కమిటీ సభ్యుడు చింకా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అధిక శాతం ఓటింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలి



ఈవీఎం మాక్‌పోల్ సెంటర్‌ను పరిశీలిస్తున్న నరేందర్ సింగ్ బాలి

మైలవరం: 2024 ఎన్నికల్లో అధిక శాతం ఓటింగ్ జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మైలవరం, నందిగామ, జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గాల సాధారణ పరిశీలకులు నరేందర్ సింగ్ బాలి అన్నారు. మైలవరం, పుల్లూరు, వెల్వడం, గణపవరం, చంద్రాల గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలలో చేసిన ఏర్పాట్లను సోమవారం నరేందర్ సింగ్ బాలి పరిశీలించి మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, ఫ్యాన్లు, తాగునీరు, మరుగుదొడ్లు, షామియానా వసతులు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని బీఎల్‌ఓలకు సూచించారు. అధిక శాతం పోలింగ్ జరిగేట్లుగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మైలవరంలోని లకిరెడ్డి హనిమిరెడ్డి ఇండోర్ స్టేడియంలో ఉన్న ఈవీఎం మాక్ పోల్ సెంటర్, లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎలక్షన్ స్టాఫ్ శిక్షణ తరగతులను, పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్, తహసీల్దార్ రాజేశ్వరరావు పాల్గొన్నారు.